క్లుప్తంగా

రహదారి నిర్మాణ పనుల ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ దావు బుచ్చయ్యకాలనీలో శనివారం రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ బీహెచ్ఎస్వీ జానారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న దృష్ట్యా రోడ్డు పనులను స్థానికులకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దావు బుచ్చయ్యకాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర సంగీత సభ



విజయవాడకల్చరల్: సంగీత సద్గురువులు సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి 106వ, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 72 వార్షిక సంగీత మహోత్సవాల్లో భాగంగా దుర్గాపురంలోని శివ రామకృష్ణ క్షేత్రంలో శనివారం నిర్వహించిన కర్నాటక సంగీత సభ ఆలరించింది. ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన సంగీత కళాకారులు వాగ్గేయకార కీర్తనలను మధురంగా గానం చేశారు. ప్రారంభ కార్యక్రమంగా సాత్విక నాదసుధారసంబిలను, సత్యనారాయణ ముపాస్మహే, వినాయక విను, నీలకంఠం భజే కీర్తనలను ఆలపించారు. శిష్ట కళ్యాణి, లలిత వయోలిన్ ద్వయం, డీవీఎల్ఎన్ శాస్త్రి, వీణ, లంకతేజస్వి, డీవీ మోహన కృష్ణ నిర్వహించిన గాత్ర సంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్, బీవీ దుర్గాభవాని, అన్నవరపు రామస్వామి పాల్గొన్నారు.

రిటైర్డ్ హోంగార్డుకు ఆర్థిక చేయూత



విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగర హోం గార్డ్స్ యూనిట్ నందు హోంగార్డుగా విధులు నిర్వర్తించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కర్రే మల్లీశ్వరికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్‌కమిషనర్ టి.కె.రాణా రూ.5 లక్షలను అందజేశారు. మల్లీశ్వరి కుటుంబానికి ఆర్థిక చేయూతనందించేందుకు జిల్లాలో పని చేస్తున్న హోం గార్డులు వారి ఒక్క రోజు వేతనాన్ని సాయంగా అందజేశారు. ఈ నగదు చెక్కును కమిషనరేట్‌లో సీపీ రాణా చేతుల మీదుగా మల్లీశ్వరికి శనివారం అందించారు. అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, హోంగార్డు ఆర్ఐ కృష్ణ పాల్గొన్నారు.

వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన కేంద్ర బృందం



పాయకాపురం(విజయవాడరూరల్): పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలపై కేంద్ర ప్రభుత్వ జాతీయ నాణ్యతా ప్రమాణాలు అంచనా బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. పాయకాపురం, కుందావారి కండ్రికలో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం కల్నర్ డాక్టర్ అజయ్‌కుమార్ సూద్, డాక్టర్ జిను, జి.థామస్‌లు శుక్ర, శనివారం రెండు రోజుల పాటు ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీపీఎంఓ డాక్టర్ నవీన్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహ నాయక్, జిల్లా నాణ్యత బృందం కేంద్ర బృందాన్ని కలిసి ఆరోగ్య కేంద్రాలపై అందిస్తున్న సేవలను వివరించారు. తనిఖీల్లో స్థానిక వైద్యశాల డాక్టర్ బాసిద్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ డెప్యూటీ ఈఈల బదిలీ

ఏలూరు(ఆర్ఆర్‌పేట): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్) ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న పలువురు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను బదిలీ చేస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నిడదవోలు కనస్ట్రక్షన్స్ విభాగంలో పనిచేస్తున్న వి.సునీతను విజయవాడ ఎల్ఎంసీ/ఎస్ఎల్‌డీసీకి బదిలీ చేశారు. విజయవాడ ఎల్ఎంసీ/ఎస్ఎల్‌డీసీలో పనిచేస్తున్న యు.సూర్యకళను తాడేపల్లిగూడెం హెచ్‌టీ మీటర్స్–2కు, విజయవాడ ఏపీపీసీసీలో పని చేస్తున్న చైతన్య వర్మను నిడదవోలు కనస్ట్రక్షన్స్‌కు బదిలీ చేశారు.

జవాబుదారీతనానికి నిర్వచనం 'జగనన్న సురక్ష'

- అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం
- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే విష్ణు



మారుతీనగర్‌లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణు, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సిబ్బంది



జగనన్న సురక్ష అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వేదికపై ప్రజాప్రతినిధులు, అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): జవాబుదారీతనానికి సరికొత్త నిర్వచనం జగనన్న సురక్ష కార్యక్రమమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా రెండో రోజు నగర మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికార యంత్రాంగం, సచివాలయ సిబ్బందితో కలిసి మారుతీనగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయాలను సేకరించారు. మహిళ సాధికారత, రైతు సంక్షేమం, విద్య, వైద్య రంగాల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలను వివరించారు. అర్హత ఉండి ఏమైనా సంక్షేమ పథకం, ధ్రువీకరణ పత్రాలు అందలేదా..? అని ఆరా తీశారు. స్థానికుల అభిప్రాయాలను ఫొటోతో సహా వలంటీర్ యాప్‌లో నమోదు చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..

ప్రతి పేదవాడికి మంచి జరగాలన్న తపన, తాపత్రయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. అర్హులకు పథకాలను వర్తింపజేయడంతో పాటు ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను కూడా ఈ కార్యక్రమంలో అందజేస్తున్నామన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, మ్యుటేషన్ లావాదేవీలు, ఆధార్‌కు బ్యాంక్ లింకేజీ, రేషన్ కార్డు మొదలైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి రుసుము లేకుండా ఇస్తున్నామన్నారని చెప్పారు. ఈ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సృజనా, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ బాబూ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు ఏ నాగేశ్వర రావు, కె.నాగాంజనేయులు, వార్డు సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. జనాలకు రక్ష

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సామాన్య పేద కుటుంబాలకు రక్ష అని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. రాజీవ్ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో జగనన్న సురక్ష కార్యక్రమ నిర్వహణ, విధి విధానాలపై శనివారం సచివాలయ సిబ్బంది, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు యరగొర్ల తిరుపతమ్మ, మోదుగుల తిరుపతమ్మతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. సభనుద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు.

పక్కాగా సర్వే నిర్వహించాలి..

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యమని ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుసంధానంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జూలై మాసం అత్యంత కీలకమన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడం ద్వారా ఈ ప్రభుత్వం నగరాలు, పట్టణాల్లో 84 శాతం మంది ప్రజలకు మేలు చేకూర్చిందని ఎమ్మెల్యే విష్ణు పేర్కొన్నారు. టెక్నికల్ సమస్యలు ఇతర కారణాల ద్వారా మిగిలిపోయిన 16 శాతం మందికి కూడా లబ్ధి చేకూర్చడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు.

ప్రతి క్లస్టర్‌ను ఒక యూనిట్‌గా తీసుకుని వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు, గృహసారథులు, కన్వీనర్లు, ప్రతి గడపకు వెళ్లాలని మల్లాది విష్ణు సూచించారు. ఒక్కో కుటుంబం వద్ద కనీసం 15 నిమిషాల సమయం కేటాయించి అభిప్రాయాలను సేకరించాలన్నారు. 63వ డివిజన్‌లోని 6 సచివాలయాల పరిధిలో 82 క్లస్టర్లు ఉండగా 64వ డివిజన్‌లోని 5 సచివాలయాల పరిధిలో ప్రభుత్వం సంక్షేమ పథకాలకు మిగిలిన అర్హులు, సమస్యలను యంత్రాంగం గుర్తించేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సృజనా, సీడీఓ జగదీశ్వరి, నాయకులు, మోదుగుల గణేష్, సీహెచ్ రవి, ఇస్మాయిల్, మేడా రమేష్, జిల్లేల శివ, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. అజిత్ సింగ్‌నగర్‌లోని షాదీఖానా నందు శనివారం సచివాలయ సిబ్బంది, గృహసారథులు, కన్వీనర్లకు కార్యక్రమ విధి విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ‹జగనన్నకు చెబుదాం› కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మరో అద్భుతమైన కార్యక్రమమే ‹జగనన్న సురక్ష› అన్నారు. అధికార యంత్రాంగం, సచివాలయ సిబ్బంది వారికి కేటాయించిన ప్రతీ ఇంటికి వెళ్లి వలంటీర్ యాప్ నందు ప్రభుత్వ సంక్షేమ పథకాల అవగాహన, సంక్షేమ ఫలాలు వారికి అందుతున్న తీరు గురించి నిర్దేశించిన ప్రశ్నావళిని పూరించాలన్నారు. సచివాలయాల పరిధిలోని కార్యదర్శులు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, అనర్హుల వివరాలతో జాబితా సిద్ధం చేయాలని మల్లాది విష్ణు సూచించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలను కొనియాడారు. స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ కెబిఎన్ లత, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

ఎస్ఐ ఏవీ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎస్ఐ ఏవీ శ్రీనివాస్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాదక ద్రవ్యాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని ఎస్ఐ ఏవీ శ్రీనివాస్ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యాన కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకారంతో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచార వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శైలజతో కలిసి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నేరాల్లో శిక్ష, జరిమానా విధిస్తారన్నారు.

కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాలు..

కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శైలజ మాట్లాడుతూ.. యువత మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ విలువలతో ఉండాలని, కుటుంబ విలువలు, శారీరక, మానసిక ఆరోగ్యాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని అడుగులు వేస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా భాగంగా ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు విజయవాడ పరిసర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మాదక ద్రవ్యాలతో అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఎస్ఆర్ఆర్ కళాశాల నుంచి బీఎస్ఎన్ఎల్ భవన్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవ హారంగా ఏర్పడి మత్తపదార్థాలకు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. అధ్యాపకులు డాక్టర్ డి.యుగంధర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రమేష్, నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్లు కె.ప్రియాంక, జె.ఆంజనేయులు, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.


హజ్ హౌస్‌పై టీడీపీ మాట్లాడటం సిగ్గుచేటు



మాట్లాడుతున్న గౌస్‌మొహిద్దీన్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): హజ్ హౌస్, హజ్ యాత్రికుల గురించి తెలుగుదేశం పార్టీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని వక్ఫ్‌బోర్డు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్ ధ్వజమెత్తారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నేత జలీల్‌ఖాన్ హజ్ హౌస్ నిర్మాణం, హాజీల గురించి తమ ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ మాట్లాడటాన్ని ఖండించారు. టీడీపీ పాలనలో 2018 మే18న హజ్ హౌస్‌కి శంకుస్థాపన చేసి, రూ.80 కోట్లతో నిర్మాణం చేస్తామంటూ ఆర్భాటపు ప్రకటనలు చేసి, ఆ తరువాత దానిని పట్టించుకోలేదని దుయ్యబట్టారు. గత పాలనలో హాజీలు పొరుగు రాష్ట్రం తెలంగాణ హైదరాబాద్ నుండి హజ్ యాత్రకు వెళ్తుంటే కనీసం పట్టించుకున్న పాపాన పోని మీకు మాట్లాడే అర్హత లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చొరవతో హాజీలకు ఇబ్బంది లేకుండా విజయవాడ నుంచే హజ్ యాత్రకు వెళ్లేటందుకు, ప్రభుత్వం గన్నవరం విమానాశ్రయానికి ఎంబర్కేషన్ పాయింట్ తీసుకు రావడమే కాకుండా, వారిపై పడిన అదనపు భారం ఒక్కొక్కరికీ రూ.80 వేల చొప్పున రూ.14.51 కోట్లు ప్రభుత్వమే భరించిందని చెప్పారు. జిల్లా వక్ఫ్ బోర్డు సహాయ కార్యదర్శి ఎంపీ ఎండీ నజీర్, నాయకులు షేక్ బడేమియా, షేక్ ఇక్బాల్, షేక్ యాసిన్, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

అందరికీ సమన్యాయమే జగనన్న లక్ష్యం



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్ సునీత

గుణదల(విజయవాడ తూర్పు): రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఒకటో డివిజన్ 238వ వార్డు సచివాలయ పరిధిలో శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఉద్దంటి సునీతతో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత స్థానిక శ్రీ కోదండ రామాలయాన్ని సందర్శించిన ఆయనకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం పడవల రేవు జంక్షన్ నుంచి పాదయాత్ర ప్రారంభించి కాలువ గట్టు వెంబడి కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రతి ఇంటికి యూజీడీ కనెక్షన్ తప్పనిసరిగా ఇవ్వాలని వీఎంసీ అధికారులకు సూచించారు.

లబ్ధిదారుల హర్షాతిరేకాలు

టీడీపీ ప్రభుత్వం గతంలో అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలను నిలిపి వేసేందుకు ఆలోచన చేస్తే.. జగనన్న ప్రభుత్వం అర్హులను వెతికి మరీ లబ్ధి చేకూరుస్తోందని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు తమ ఆనందాన్ని ప్రజాప్రతినిధులతో పంచుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

చంద్రబాబు చేసిన ద్రోహాన్ని మర్చిపోం..

టీడీపీ హయాంలో బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసి.. పేద అర్చక, పురోహితుల గొంతు కోసిన గత పాలకులు మరలా ఏ ముఖం పెట్టుకుని సమావేశాలు నిర్వహిస్తారని ఎమ్మెల్యే విష్ణు ప్రశ్నించారు. తిరుపతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వంపై నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. టీడీపీ నాయకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే చంద్రబాబు హయాంలో బ్రాహ్మణ సామాజిక వర్గానికి అందించిన సంక్షేమంపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఆనాడు పథకాల అమలులోనూ పెద్దఎత్తున కోతలు విధించి.. బ్రాహ్మణుల గొంతు కోశారని విమర్శించారు. అర్చకులకు వంశపారపర్యమైన హక్కులు కల్పించమంటే.. గొంతెమ్మ కోర్కెలు కోరవద్దని చంద్రబాబు అవమానించింది వాస్తవం కాదా..? నారా లోకేష్ వీటిపై సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారిగా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ అభివృద్ధి కోసం రూ.70 కోట్ల నిధులు కేటాయించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సీడీఓ జగదీశ్వరి, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, నాయకులు ఉద్దంటి సురేష్, కొండా మహేశ్వర్ రెడ్డి, మానికొండ సాంబశివరావు, బండి వేణు, ఎల్.ఐ.సి. శివ, జక్క బాబు, తాతారావు, నాగరాజు, కొలకలేటి రమణి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.





ఘనంగా జగన్నాథ రథయాత్ర

నగరంలోని శనివారం జగన్నాథ రథయాత్ర ఘనంగా జరిగింది. ఇస్కాన్ శ్రీ జగన్నాథ్ మందిర్ ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులో జరిగిన రథయాత్రలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్ చార్జి దేవినేని అవినాష్ పాల్గొన్నారు. రథయాత్రలో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ పెనుమత్స శిరీష

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వార్డు సచివాలయం సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పనిచేసి ప్రజల్లోకి తీసుకువెళ్లాలని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష సూచించారు. స్థానిక డివిజన్ వార్డు సచివాలయంలో శనివారం స్పెషల్ ఆఫీసర్ జగదీష్‌తో కలిసి వార్డు సచివాలయం సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. వలంటీర్లు ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్ల వివరాలు సేకరించి సర్టిఫికెట్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయం సిబ్బంది, వలంటీర్ల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి పెనుమత్స సత్యం, నాయకులు వెంకటేశ్వరరావు, అంగిరేకుల విజయ్ పాల్గొన్నారు.

నవరసాల దృశ్యకావ్యం దేవదాసు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కొల్లూరి, దోగిపర్తి, అక్కినేని అభిమాన సంఘం ప్రతినిధులు

విజయవాడకల్చరల్: అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి నటజీవితంలో చిరస్థాయిగా నిలిచిపోయిన చలనచిత్రం దేవదాసు అని ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అన్నారు. దేవదాసు చిత్రం విడుదలై 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ, శారదా కళాసమితి, మన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కొల్లూరి మాట్లాడుతూ.. సావిత్రి, అక్కినేని నటన వారి జీవితంలో కొత్త పాత్రలకు జీవం పోసిందన్నారు. శారదా కళాసమితి అధ్యక్షుడు దోగిపర్తి శంకర్రావు మాట్లాడుతూ దేవదాసు చిత్రం తెలుగు సినిమా చరిత్రలో క్లాసిక్‌గా నిలిచిపోయిందన్నారు. మన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు ఎం.రామకృష్ణ, సంస్థ లక్ష్యాలను వివరించారు. అక్కినేని అభిమాన సంఘం నాయకులు పురాణం రమణ, కేవీఎస్ సత్యనారాయణ, మిరియాల ఏడుకొండలు, సుకుమార్‌రెడ్డి, జి.సూర్యనారాయణ పాల్గొన్నారు. అక్కినేని జీవిత సాఫల్య పురస్కారాన్ని జి.ప్రసాద్‌కు అందజేశారు. ఇదే ప్రాంగణంలో సాయంత్రం అక్కినేని అభిమానుల ఆత్మీయ సమావేశం, దేవదాస్ చిత్రంపై క్విజ్ పోటీ నిర్వహించారు. దేవదాసు 70 ఏళ్ల బ్రోచర్‌ను కొల్లూరితో పాటు అతిథులు ఆవిష్కరించారు.

ఎటపాక మండలంలో నిర్వాసిత గ్రామాలు గుర్తించాలి

సాక్షి, అమరావతి: ఎటపాక మండలంలో వరద తాకిడికి గురైన అన్ని గ్రామాలను నిర్వాసిత గ్రామాలుగా గుర్తించి నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శనివారం రాసిన లేఖను శ్రీనివాసరావు మీడియాకు విడుదల చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలో తాను ఈ నెల 20, 21 తేదీల్లో పాదయాత్ర చేసిన సందర్భంలో ఆ ప్రాంత వాసులు ముంపు సమస్యను ప్రస్తావించారన్నారు. 87 గ్రామాలకుపైగా వరదతో పాటు పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వలన ముంపునకు గురవుతున్నాయని పేర్కొన్నారు. కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా ఎటపాక మండలంలో వరద తాకిడికి గురైన అన్ని గ్రామాలను నిర్వాసిత గ్రామాలుగా గుర్తించి నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ ప్రకారం డబ్బులు చెల్లించి, ముంపు లేని చోట ఇళ్లు కట్టించి ఇవ్వాలని శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు.

7న పేరంటాలమ్మకు శాకంబరీ అలంకరణ

రామవరప్పాడు: రామవరప్పాడు గ్రామంలోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జూలై ఏడో తేదీన అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరిస్తున్నట్లు ఈవో పి.లోకేశ్వరి శనివారం తెలిపారు. కూరగాయలు, పండ్లు సమర్పించ దలచిన భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

దాసాంజనేయస్వామి ఆలయంలో బహిరంగ వేలానికి విశేష స్పందన

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో భక్తులు సమర్పించిన కొబ్బరి చిప్పలు సేకరణకు, ఆలయ ప్రాంగణంలో పూజా సామగ్రి విక్రయించుకోవటానికి శనివారం దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలం జరిగింది. వేలంలో ఏడాది పాటు కొబ్బరి చిప్పలు సేకరణకు రూ. 2.10 లక్షలకు హెచ్చుపాటదారు ఆర్.చిరంజీవులు, పూజా సామగ్రి విక్రయానికి హెచ్చుపాటదారు భానుశేఖర్ నెలకు రూ.10,116కు దక్కించుకున్నారు. బహిరంగ వేలంను శ్రీకాశీవిశ్వేశ్వరస్వామివారి దేవాలయం కార్యనిర్వహణాధికారి నూతక్కి సాంబశివరావు పర్యవేక్షణలో, ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు, ధర్మకర్తల సమక్షంలో జరిగింది. వేలంలో గతేడాది కన్నా కొబ్బరి చిప్పలు సేకరణకు రూ.50 వేలు, పూజా సామగ్రి విక్రయానికి రూ.37,392 అధికంగా ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

'ఉపా' చట్టాన్ని రద్దు చేయాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉ.పా.)ను తక్షణమే రద్దు చేయాలని ఉ.పా. రద్దు పోరాట కమిటీ కన్వీనర్ చిలుకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఉ.పా. రద్దు పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రశ్నించే ప్రజాస్వామిక వాదులపై ఉ.పా. కేసులు పెట్టి ఏళ్ల తరబడి జైళ్లలో నిర్బంధిస్తున్నారన్నారు. 2018వ సంవత్సరంలో ప్రధాని నరేంద్రమోదీని హత్య చేయడానికి కుట్రపన్నారని భీమాకోరేగావ్ కుట్ర కేసు నమోదు చేసి దేశంలోని 16 మంది ప్రజాస్వామిక వాదులపై కేసు నమోదు చేశారన్నారు. ఆ కేసులో ప్రజాస్వామిక వాదులను ఐదేళ్లుగా జైళ్లలో నిర్బంధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉ.పా. చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సి.భాస్కర్ రావు(ఓపీడీఆర్), దుడ్డు ప్రభాకర్ (కెఎన్‌పీఎస్), రాధ(సీఎంఎస్) కొండారెడ్డి(పీకేఎస్), వెంకటేశ్వర్లు(పీడీఎం), అరసవిల్లి కృష్ణ (విరసం), పోలారి, ఎ.రవిచంద్ర, కోటి(ప్రజాకళా మండలి) తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేదల కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని దళిత బహుజన రిసోర్స్‌సెంటర్(డీబీఆర్‌సీ) ట్రైనింగ్ కో ఆర్డినేటర్ హేమలత అన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో శనివారం వేస్ట్ పికర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. వేస్ట్ పికర్స్ తమ పిల్లలను బాగా చదవించుకోవాలన్నారు. పరిశుభ్రంగా ఉంటూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. వేస్ట్ పికర్స్ తదితరులకు ప్రభుత్వం ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిందన్నారు. డీబీఆర్‌సీ కో ఆర్డినేటర్ జామి రమాదేవి మాట్లాడుతూ.. సమాజంలో అట్టడుగున ఉన్న వేస్ట్ పికర్స్‌కు మున్సిపాలిటీల్లో పనులు కల్పించాలన్నారు. ఇంకా ఇళ్లు లేని వారు ఉన్నారని వారికి ఆవాసాలు కల్పించాలని కోరారు. వైఎస్సార్ కాలనీలో వాగ్రీ కులస్తులు నివాసం ఉంటున్నారని, వారికి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు.

తప్పిన పెనుప్రమాదం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే దావు బుచ్చయ్యకాలనీ మెయిన్ రోడ్డులో శనివారం ఉదయం పెనుప్రమాదం తప్పింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు బురదగా మారటంతో ఇసుక లోడుతో వచ్చిన లారీ మట్టిలో కూరుకుపోయింది. దీంతో లారీ బుడమేరు వైపు ఒరిగిపోవటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే లారీలోని ఇసుకను ట్రాక్టర్ల ద్వారా బయటకు తీసి లారీని బయటకు తీశారు. లారీ రోడ్డుపై నిలిచిపోవటంతో వాహన చోదకులు రాకపోకలకు అవస్థలు పడ్డారు.